# పాకవిశారద

శ్రీనివాస కాశ్యప

ఒకసారి మావూరికి, క్రొత్తగా ఎక్సయిజుఇన్‌స్పెక్టర్ గారువచ్చారు. ఆ రోజుల్లో మా గ్రామంలోనూ, పరిసరగ్రామాలలోనూ, గంజాయి పంట అధికంగా పండించుతూవుండేవారు. అందువల్ల మావూరు ముఖ్యకేంద్రంగావుండేది ఎక్సయిజు డిపార్టుమెంటుకు. ఇన్‌స్పెక్టర్ గారి ఆఫీసూ, కాపురమూ ఒకయింట్లోనే. ఆయన, పరిసరగ్రామాలు తనిఖీకి వెళ్లివస్తూ మావూళ్లోనే హెడ్డాఫీసు వుండడంచేత, అచ్చటనే వుండేవారు.

వారు బెంగుళూరు ప్రాంతానికి చెందినవారు. మధ్వబ్రాహ్మణులు. వారికి కన్నడమేగాని తెలుగు భాష బాగారాదు. ఆ మాట్లాడే కొంచెమైనా, సగం కన్నడంకలిపి మాట్లాడేవారు. వారిపేరు గుండురావుగారు. భాషబాగా రాకపోయినా, ఆయన తెలుగు బాగా అర్థంచేసుకోగలిగేవారు. స్నేహపాత్రుడు. వచ్చినది క్రొత్తవూరు, క్రొత్త భాషా ప్రాంతమైనా, ఇట్టే సంపాదించారు బోలెడుమంది స్నేహితులను. చాలా సరదాయైనవారు గుండురావుగారు. ప్రతివారినీ ఇట్టే స్నేహం చేసుకోగల స్వభావం ఆయనది.

అందులో మావూరు పల్లెటూరూ, పట్నమూ కాని మధ్యరకం బస్తీకావడాన నూటికితొంభై మందికి ఉద్యోగం, సద్యోగం ఉండేదికాదు. అంచేత పనిపాటలు లేని పప్పుధప్పళాల రాయళ్లంతా, పెందరాళే కాఫీలు, టిఫిన్లు ముగించుకుని గుండురావుగారి యింటికి చేరేవారు. రావుగారు, ఆఫీసూ ఇల్లూ వకటే గనుక (కాంపు లేని రోజుల్లో) ఎప్పుడెవరు వెళ్లినా దర్శనమిచ్చేవారు. ఉదయం ఏ కొద్ది గంటల్లోనో ఆఫీసుపనులు ముగించుకుని వచ్చేపోయే స్నేహితులను, ఆహ్వానించడం, పంపించడం చేస్తూ వుండేవారు. పది గంటలు దాటుతోందనగా, ఒక బాచి వచ్చి వెళ్లిపోయేవారు; భోజనాలు చెయ్యడానికి ఇళ్ళకు. అంతలో రావుగారు కూడా భోజనానికి లేచేవారు.

ఇక మళ్లీ పన్నెండు గంటలు కావస్తోందనగా ఒక్కొక్కరే తయారు. అందరూ కలిసి ఏ చీట్లాటో చదరంగమో ఆడుతూ నాలుగింటిదాకా గడిపి, మళ్ళీ అంతా కలిసి షికారు పోయేవారు.

రావుగారికి ఇద్దరు పిల్లలు. ఆడపిల్ల పెద్దది. లేక లేక పది సంవత్సరాలకు మొగపిల్లవాడు పుట్టాడట. వాడి పేరు రఘుపతి. మావూరు వచ్చేసరి కాపిల్లవాడికి సంవత్సరం నిండవస్తోంది. వాడి పుట్టినరోజు పండగ పెద్దయెత్తున చేయదలిచారు రావుగారు; ఒకడే మొగపిల్లవాడవడమూ, అందులో మొట్టమొదటి పుట్టినరోజు కావడముచేత. అదీగాక, ఈ క్రొత్త స్నేహితులందరికీ ఏదో ఒకవంకన డిన్నరుపార్టీ చేయాలని రావుగారి సంకల్పం. ఇవన్నీ కలిసిరావడంచేత, చాలా ఉత్సాహంగా పుట్టినరోజు పండుగ చేయదలిచారు రావుగారు.

ఒకరోజు మధ్యాహ్నం స్నేహితులంతా కూడి, చీట్లపేక ఆడుకుంటూ వుండగా, రావుగారే మెల్లిగా స్నేహితులందరికీ చెప్పారు ఫలానిరోజున మా రఘుపతి పుట్టినరోజని, మీరంతా సకుటుంబంగా రావాల్సిందనీ. అందుకు మిత్రులంతా చాలా సంతోషంతో వస్తామన్నారు. ఇంతలో రావుగారి భార్య తలుపుచాటున నించుని "మీ స్నేహితులందరినీ, పుట్టినరోజుకు ఆహ్వానిస్తున్నారు బాగానే వుంది; కాని, ఆనాడు వంటబ్రాహ్మణుడు కావాలన్న విషయం మరిచిపోయారల్లే వుంది" అని అన్నది మెల్లిగా.

నిజంగా రావుగారు ఆ విషయం మరచిపోవడంచేత, వారిముందు ప్రస్తావించలేదు. అందువల్ల—

## ★ పాకవిశారద ★

'అరశేనమయానికి జ్ఞాపకం చేశావు; ఆ విషయం మనమిత్రులకు చెప్పకపోతే ఎవరు కుదిర్చిపెడతారూ," అని కన్నడంలో యిద్దరూ మాట్లాడుకున్నారు. వచ్చి కూర్చున్న మిత్రులంతా, ఏమి మాట్లాడుకుంటున్నారో బోధపడక, ఒకరి మొగాలొకరు చూసుకుంటూ నిశ్శబ్దంగా కూర్చున్నారు ఆట ఆపేసి.

రావుగారు మెల్లిగా అందుకున్నారు వచ్చీరాని తెలుగులో. "ఏమంటోయ్! మీరంతా భోజనాలకు రావడమేగాదు. మనకు కమ్మని వంట చేయగల వంటబ్రాహ్మడిని కూడా మాట్లాడుకు రావాలి సుమీ" అని. మిత్రులందరూ ఏకగ్రీవంగా ఫస్టుక్లాసు వంటబ్రాహ్మడిని తీసుకొస్తామన్నారు. ఇంతలో శాస్త్రి అందుకుని, "మన సుబ్బయ్యను పిలిస్తే సరి, స్వీట్లతో కూడా అమోఘంగా తయారుచేస్తాడు" అన్నాడు.

"ఒరేయ్! భలేవాణ్ణి జ్ఞాపకం చేశావురా! నలభీమపాకాలు. పట్టి కొట్టాల్సిందే మనవాడి వంట ముందర!" అన్నాడు శర్మ.

ఏమయితేనేం, ఆఖరికి సుబ్బయ్యను వంటచేయడానికి పిలుద్దామన్న నిర్ణయానికివచ్చారు అంతా. ఆనాటికి మూడు రోజులుంది పుట్టిన రోజు. అన్నిపనులలోనూ, మిత్రులు ముందు నుంచుని చేస్తామని రావుగారికి హామీ యిచ్చారు. నాటినుంచే ఏర్పాట్లకు ప్రారంభోత్సవం చేశారు. వాకిట్లో చల్లదనానికి, పెద్ద పందిరి వేశారు. ఇలాగే దొడ్లో వంటచేయడానికి పందిరివేసి, అన్ని హంగులూ అమర్చారు మిత్రులందరూ కూడి. ఇల్లు పెళ్లిల్లులా అలంకరించబడింది.

రావుగారు, కాలుకదపకుండా, అన్ని పనులూ లోటులేనివిధంగా, మిత్రబృందమే పూర్తి చేసింది.

* * *

పుట్టినరోజుపండుగనాటి ఉదయం సుబ్బయ్య, సహాయంగా ఇంకొక మనిషిని వెంటబెట్టుకొని వచ్చేశాడు. అప్పటికింకా అతిథులెవరూ రాలేదు. సుబ్బయ్యను చూడగానే రావుగారు కాఫీ టిఫిన్లు తయారుచేయడానికి సామగ్రియావత్తూ అప్పజెపుతూ, వంట ఏమేమి చేయాలో, సుబ్బయ్యకు చెప్పారు వారి భాషలో.

"పుర్లగడ్డకరి మాడబేకు, బేడాహుళీ మాడబేకు, రస మాడబేకు, పాయసా మాడబేకు, వడ, లడ్డూ, ఎల్లా మాడబేకు"(అన్నీ చెయ్యాలి) అని. కాఫీటిఫినూ ముందుచేసి, పైన చెప్పినవన్నీ తరువాత చేయడం మొదలెట్టమన్నారు రావుగారు.

రావుగారి ప్రసంగం అంతా విన్నాడు సుబ్బయ్య. "అన్నం మాడ్చచ్చు; పప్పు మాడ్చచ్చు; పాయసం కావాలంటే, అడుగున చెక్కుకట్టేలా మాడ్చచ్చు; కాని పప్పుపులుసు (బేడాహుళి), రసం (చారు) ఎల్లా మాడ్చాలా అన్న పెద్దసమస్య వేధించటం మొదలుపెట్టింది సుబ్బయ్యను కాని, ఈ సందేహం రావుగారిముందు వెలిబుచ్చలేకపోయాడు; తాను గొప్ప వంటవాడుగనుక "ఇదికూడా తెలియని వంటవాడా?" అనుకుంటారని!

అందువల్ల అన్నింటికీ, బుర్ర ఎగరేశాడు సుబ్బయ్య.

"బేగా మాడప్పా ఎల్లా"(అన్నీ త్వరగా చెయ్యి బాబూ!) అంటూ రావుగారు అతిథులను ఆహ్వానించడానికి వాకిట్లోకి వెళ్ళిపోయారు.

* * *

"వెధవది! ఇన్ని సంవత్సరాలుగా వంట చేస్తున్నాను. ఎందరెందరో ఆఫీసర్లు సైతం నా వంట మెచ్చుకుని యోగ్యతాపత్రాలిచ్చారు. ఇన్ని సంవత్సరాల అనుభవంలోనూ చారూ, పులుసూ మాడ్చడం ఎరగనుగదా!......ఈ దెబ్బతో మనకు పరాజయం తప్పదు!..." చారు ఎలా మాడ్చడమా అని బిక్కమొగం పెట్టుకుని కూర్చుండిపోయాడు సుబ్బయ్య.

అసిస్టెంటు ఆలోచించి, ఆలోచించి "సుబ్బయ్యగారూ! నేనూ,

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
కండపుష్టికి. వీర్యవృద్ధికి
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్ మద్రాసు-17

ఎందరో మీలాంటి పెద్దలవద్ద పని చేశాను గాని ఇలా అన్నీ మాడ్చుకోడం ఎరగను సుమండీ! అయినా, నాకో యోచన తోస్తోందండీ... బాగా వంటపెట్టి చూడండి...... మరి......వాళ్లు మాడ్చుకుంటూనే ఉండుంటారు; లేకపోతే మాడ్చమని ఎందుకు చెబుతారు?" అని పెద్ద విశేషం కనిపెట్టినవాడిలా ముఖం పెట్టి అన్నాడు.

సుబ్బయ్యగారు, మరి నాలుగు కట్టెలు అదనంగా పొయ్యిలో జేర్చి చారుపెట్టిన సత్తుగిన్నె అంతు కనుక్కోడానికి ప్రయత్నించారు! పొయ్యి అమోఘంగా మండిపోతోంది. అన్ని పదార్థాలూ తయారయాయి. కాని, చారూ, పులుసూ మాడితే వంటంతా పూర్తయిపోయినట్టే! దానికోసం ఎదురుచూస్తున్నారు సుబ్బయ్యగారు. రావుగారి భార్యన్నా వస్తుందేమో ఆమెను ఈ విషయం రహస్యంగా అడిగి తెలుసుకుందామనుకున్నాడు. కాని, ఆమె పేరంటం గొడవలో ఈ ప్రక్కకే రాలేదు. ఏమి చెయ్యటానికీ తోచక, చారు, పులుసు ఎప్పుడు మాడుతుందా అని భగవద్ధ్యానం చేస్తున్నాడు సుబ్బయ్య!

ఇంతలో రావుగారు, "ఎల్లా మాడిఅయిత్తా అప్పా!" (వంటంతా అయిపోయిందా బాబూ) అంటూ వంటయిల్లు ప్రవేశించారు. వారి వెనకనే శాస్త్రీకూడా వచ్చాడు.

సుబ్బయ్యగారు, అప్పటికే నవనాడులూ క్రుంగటాన పేలవంగా ముఖంపెట్టి, "అన్నీ మాడినయ్ గాని, ఈ చారూ పులుసూ మాడేటట్లు లేదు బాబూ!!" అన్నాడు.

అమాంతం హడిలిపోయి శాస్త్రీ "అన్నీ మాడ్చేసేవేమిటి కొంప దీసి?" అన్నాడు ఆదుర్దాగా.

"లేదు బాబూ, అన్నీ మాడాలని రావుగారే చెప్పారు. అందుకని అన్నీ సాధ్యమైనంత వరకూ మాడ్చాను" అన్నాడు సుబ్బయ్య!

"ఓరి నీ తస్సల్ చెక్కా! భలే వాడివయ్యా?! మాకందరికీ అపకీర్తి తెచ్చావుగదా!" అని నిర్ఘాంతపోయి చూస్తున్నాడు శాస్త్రీ. ఇంతలో శర్మా, మిగతా అతిథులూ వచ్చారు ఏమిటో చూద్దామని. రావుగారు నిర్విణ్ణులై నుంచుండిపోయారు.

వచ్చీ రాగానే అందరూ, అన్ని భోజనపదార్థాలూ, పరీక్షచేశారు. ఒకటీ సవ్యంగా తయారుకాలేదు. అన్నీ—సుబ్బయ్య చెప్పినట్లు సగం మాడువే!! వంటంతా నాశనం చేసేశాడు. మిత్రులంతా ఒకరి మొగాలొకరు చూసుకున్నారు "పాకవిశారద" చేసిన పనికి.

ఇంతలో శాస్త్రీ అందుకొని, "ఒరేయ్ అబ్బాయిలూ! సుబ్బయ్యగారెంత ఘటికులైనా, యిదంతా భాష తెలియనందువల్ల వచ్చిన బాధరా! ముందుగా మనే జాగ్రత్త పడాల్సిందిసుమీ" అన్నాడు తాను చేసిన తప్పు సర్దుకుంటున్నట్లు.

"ఒరేయ్ శాస్త్రీ! నువ్వూ, శర్మా కలిసి తెగపొగిడిన సుబ్బయ్యగార్ని మీరు సమర్థించకపోతే ఎవరు సమర్థిస్తార్లే!!" అన్నారు మిగతావారు నవ్వుతూ.

తన కీనాడుజరిగిన పరాభవానికి తల ఎత్తుకోలేక ఒకమూల చదికిలబడ్డారు సుబ్బయ్యగారు! అసిస్టెంట్ అసలు నోరెత్తనేలేదు. పొయ్యి మీదున్న చారూ, పులుసూ దింపి క్రింద పెట్టబడినయ్! శాస్త్రీ, శర్మా నడుంకట్టి అందరికీ భోజనాల ఏర్పాటుకు మొదలుపెట్టారు—రావుగారిదంతా చూస్తూవుండిపోయారు.

ఏమయితేనేం వచ్చినవారంతా సగంమాడిన సామగ్రితోనే తృప్తి పడి, చిరంజీవిని ఆశీర్వదించి, రావుగారి దంపతులను అభినందించి మాడిన ముఖాలతో ఇళ్ళకు చేరారు. ★

శ్రీ వత్స వారి
స్కినెడెక్స్
దురదలకు, పుండ్లకు, చర్మవ్యాధులకు
దివ్యౌంజనము.

పంచతంత్రం
బొమ్మల కథల పుస్తకం
మొదటి భాగం
(మిత్రభేదం, మిత్రలాభం)
కర్త: కీ॥ శే॥
విశ్వాత్ముల నరసింహమూర్తి
వెల: రూ. 1-8-0
ఆంధ్రగ్రంథమాల,
మద్రాసు-1.

అకాల నెఱి, బట్టను ఆపుటకు
కాశ్మీర్-కుసుమం
మీ ఇష్టమైన నూనెలో నానవేంది
యునైటెడ్ కెమికల్ రిసెర్చ్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.
చర్మ ఉపద్రవములకు, అపాయములకు
అత్యున్నతమైన సుగంధ ములాము
సాంటలక్స
గజ్జి, పుండ్లు, కాటులు మొటిమలు

రాజూ - పేదా
వెల రూ 2-0-0
తపాల ఖర్చు ప్రత్యేకం.
ఆంధ్రగ్రంథమాల మద్రాసు.